

# నీలితెర

ముద్దంశెట్టి హనుమంతరావు

భాస్కరం అప్పుడే రిక్షాలోంచి దిగి, విసురుగా లోపలి కొచ్చాడు. అతడి మొహంలో ప్రసన్నత అగుపించలేదు వీర్రాజుకి. కొద్దిపాటి ఆశ్చర్యం కలిగింది. ''అమ్మాయి నచ్చినట్టేనా భాస్కర్?'' అన్నాడు వీర్రాజు. ''నాకు నచ్చలా'' విసురుగానే అంటూ లోపలి గదిలోకి వెళ్ళబోయాడు భాస్కరం.

"నచ్చలేదూ? కారణం?" మామూలు ధోరణిలోనే మరో ప్రశ్న వేశాడు వీర్రాజు. ఆ ప్రశ్న భాస్కరంని షడన్ బ్రేకు వేసినట్టుగా నిలబెట్టింది.

భాస్కరం వెనక్కి తిరిగి, తండ్రికేసి తీక్ష్ణంగా చూశాడు.

"కారణాలు సవాలక్ష వుంటాయి నాన్నా; అవన్నీ మీతో చెప్పాలా? నా అర్థాంగి! యెన్నుకోవడంలో నాకు పూర్తి స్వాతంత్ర్యం వుండాలి...వుంది కూడాను. కాదంటారా? అటువంటప్పుడు, యీ విషయంలోనూ మీరే కలిగించుకుని మీ పెద్దరికాన్ని నిలబెట్టుకోడానికి ప్రయత్నించడంలో అర్థం లేదంటాను. అది అవివేకం కూడాను" నిర్లక్ష్యంగా అంటూ, అక్కణ్ణించి నిష్క్రమించాడు భాస్కరం.

వీర్రాజు మనస్సు చివుక్కుమంది. అప్పుడే బైట్నుంచి వచ్చిన జానకమ్మ, కొడుకు మాటల్ని స్పష్టంగా వింది. ఆమెకీ బాధనిపించింది. ఇటీవల కొడుకు ప్రవర్తన చాలా వింతగా విపరీతంగా మారింది. దానికి కారణం యేమిటో ఆమెకీ బోధపడ్డంలేదు. ముఖ్యంగా వాడు తండ్రిని మరీ లోకువచేసి మాట్లాడ్డంతో అర్థమేమిటో యెంత ఆలోచించినా, సమాధానం దొరకలేదు. "ఎంతో ఆశతో పెళ్ళిచూపులకి వెళ్ళాం గానండీ మనవాడికి ఆ అమ్మాయి నచ్చలేదుట" చెప్పింది జానకమ్మ. "అవన్నీ నాకెందుకు లేవే! వివాహం వాడి స్వవిషయం. ఇందులో నాకేం ప్రమేయం లేదు. వుండకూడదు కూడాను" ఎంతో బాధపడుతూ అన్నాడు.

భర్త బాధను అర్థం చేసుకుంది జానకమ్మ. "వాడి మాటల్ని మీరు పట్టించుకోకండి. చిన్నవాడు ఆవేశం ఎక్కువ" అంది.

వీర్రాజు బాధతో కూడిన ఓ నిట్టూర్పు విడిచాడు.

"ఔనే యేంచేస్తాం? ఉద్యోగం చేసుకుంటున్నా వాడు చిన్నవాడే! ఏం చేస్తాం? ఏదో విధంగా సరిపెట్టుకుందాం. కాయలున్న చెట్టే రాళ్ళ దెబ్బలు తింటుంది" అన్నాడు.

జానకమ్మ మరేం మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయింది.

వీర్రాజు బరువుగా ఓ నిశ్వాసం వదులుతూ పంచెకొనతో చెమ్మగిల్లిన కళ్ళను ఒత్తుకున్నాడు.

* * *

వీర్రాజు ప్రభుత్వ కార్యాలయంలో సబ్ హెడ్ గా పనిచేసి, యీమధ్యనే రిటైరయ్యాడు. మంచికి మారుపేరుగా అందరితో మసలి, మన్ననల్ని పొందాడు. నిజాయితీగా బతికి, కష్టార్జనతో కొడుకుని ఇంజనీరింగు చదివించాడు. ఫలితముగా అప్పులపాలయ్యాడు. రిటైర్ అయ్యాక, వచ్చిన డబ్బుతో అప్పులు తీర్చేశాడు.

అయితే తండ్రి అప్పులుచేసి తనని చదివించాడన్న విషయం అప్పుడే తెలిసిన భాస్కరం, తండ్రి ప్రయత్నాన్ని హర్షించలేకపోయాడు. ఆయన రిటైరయి తాను తెచ్చుకున్న డబ్బుతో హాయిగా జీవిస్తాడని భావించిన భాస్కరానికి

ఆయన ఏమీ మిగల్చకపోగా పూర్తిగా తనకి భారమై కూర్చున్నాడన్న భావన రావడంతో తండ్రిమీద యేహ్యభావం అతనిలో మొలకెత్తింది. అదీ అతని నిరసనకు నాంది.


కొడుకులో వచ్చిన పరిణామాన్ని అర్థంచేసుకోకపోలేదు వీర్రాజు. అయితే తను డబ్బుని తగలెయ్యలేదు కదా! అప్పులు చేసినా, కొడుకుని ప్రయోజకుణ్ణి చెయ్యగలిగానన్న తృప్తి అతనిలో మిగిలింది. జీవితంలో అతను సాధించిన పెద్దవిజయం అదే! కాని ఆ తృప్తి కొడుకులో లేకపోయినందుకు బాధపడ్డాడు. తనని తేలిగ్గా చూస్తోన్న కొడుకు తెలివి హీనతకు లోలోన నవ్వుకుంటూ వుంటాడు వీర్రాజు.

పుత్రసంతానం కావాలని ప్రతీ తలిదండ్రులూ వాంఛిస్తూంటారు. పుత్రుడు తమని పున్నామనరకం నించి తప్పిస్తాడన్న చాదస్తపు వాదన ఒకటి. మరో స్వార్థంకూడా వారిలో లేకపోలేదు. అదేమిటంటే తమని కొడుకు వృద్ధాప్యములో పోషిస్తాడన్నది. అయితే యీనాటి తరంలో వస్తోన్న మార్పుల్ని పరిశీలనగా గమనిస్తే తలిదండ్రుల ఆశల్ని తీర్చే కొడుకులు తక్కువ శాతంలో వుంటున్నారేమో ననిపించింది వీర్రాజుకి. యువతరం యెందుకిలా మారిపోతున్నారో అతనికేం బోధపడలేదు.

* * *

ఒకరోజు ధర్మరాజు అనే కంట్రాక్టరు భాస్కరంతో మాట్లాడుతూ వుంటే, అనుకోకుండా వీర్రాజు ఆ గదిలోకి రావడము తటస్థించింది. ధర్మరాజు చిరపరితుడవ్వడంవల్ల వీర్రాజు అతణ్ణి పలుకరించాడు.

భాస్కరం మొహం చిట్లించుకుని తండ్రికేసి నిరసన భావంతో చూశాడు.



"మీ రెందుకు నాన్నా నా ఆఫీసు గదిలోకి వస్తారు? ఎక్కడో ఓ మూల కూచుని 'రామా కృష్ణా' అనుకో కూడదు?" అన్నాడు.

ధర్మరాజు నివ్వెరపోయాడు. అతనికి కొంత మేరకు తెలుసు, వీర్రాజుగారు కొడుకు చదువుకోసం యెన్ని అవస్థలు పడేవారో; అటువంటి తండ్రికి లభిస్తోన్న గౌరవం యిదా?...అన్న ఆశ్చర్యం కలిగింది అతనికి. అయినా యేమీ అనలేక పోయాడు. ఎందుకూ అంటే, భాస్కరం గారి చేతిలోనే తనపని జరగాలిప్పుడు.

వీర్రాజు మొహం దించుకుని, అవమాన భారంతో కృంగిపోతూ, అక్కణ్ణించి వెళ్ళిపోయాడు. ఆ సమయంలో, అతనికి జీవితంమీద విరక్తిభావం మొలకెత్తినమాట వాస్తవమే! అయితే అతనిలోని సహనం అతణ్ణి సమాధానపర్చింది. ఆరోజునుంచీ వీర్రాజు, కొడుకు ఆఫీసు గదిలోకి రావడం మానుకున్నాడు.

భాస్కరం, తాను ప్రేమించిన ప్రేమబాలను పెళ్ళిచేసుకున్నప్పుడు, ఎవ్వరితోనూ సంప్రదించలేదు. తల్లితో ఏదో మాటవరుసకి చెప్పాడుగాని,ఆ చెప్పడం తండ్రితో అసలే లేదు. గుట్టుచప్పుడు గాకుండా రిజిష్టరు మేరేజ్ చేసుకుని, చక్కా యిద్దరూ యింటికొచ్చినపుడే వీర్రాజు చూశాడు. అతనికి నిజంగా మతిపోయినట్టయ్యింది. కనీసం తను పెళ్లి చేసుకుంటున్నానైనా తెలియనివ్వకుండా కొడుకు ప్రవర్తించిన తీరు, అతనికి అవమానకరంగానే తోచింది. ఒక ప్రక్క ఆవేశమూ వచ్చింది. కాని, యిప్పుడు ఆవేశపడి తను సాధించవల్సిందేమీ లేదనుకున్నాడు. అందుకు తన వయస్సు అడ్డొస్తోందని భావించాడు.

క్రమంగా వీర్రాజు పరిస్థితి దిగజారిపోతోంది ఆ ఇంట్లో. ఏపాటి గౌరవం ఇచ్చినా, అగ్నిసాక్షిగా అతను వివాహమాడిన భార్య మినహా మరెవ్వరూ గౌరవించడంలేదు. ఆ ఇంట్లో, ఈ పనికీ, ఆ పనికీ వుపయోగపడే వ్యక్తిగా మినహా, అతని వునికి మరో ప్రయోజనాన్ని సాధించలేకపోతోందంటే, ఆశ్చర్యం లేదు.

* * *

భర్తని, కొడుకే అంత నిరసనగా చూస్తుంటే ఏ భార్య మాత్రం హర్షిస్తుంది? జానకమ్మకి కొడుకు ప్రవర్తన ఏమీ నచ్చలేదు ఇంతకీ ఆయన చేసిన తప్పేవిఁటి, వాడంతగా నిరసించిడానికి అబ్బాయి చెప్పిన కారణం ఒక్కటే! తనకి ఆస్తిపాస్తులు అందివ్వలేదని, పైపెచ్చు బరువై కూచున్నారని ఆ అభిప్రాయాన్ని మార్చుకోమని, ఎన్నోసార్లు కొడుక్కినచ్చజెప్పింది. కాని,భాస్కరం మారలేదు. అతడిలో వేళ్లు నాటుకుపోయిన ఆ భావన. ఇంత సులువుగా అంతరించేదికాదు. అందుకే జానకమ్మ మరింత కుమిలిపోసాగింది.

ఓ రోజు కోడలితో యీ విషయాన్ని చెప్పింది వివరంగా కోడలయినా పరిస్థితిని చక్కదిద్దుతుందేమోనన్న ఆశతో.

అంతా విన్న ప్రేమబాల నిర్ఘాంతపోయింది. భర్త చెప్పినంత మేరకు మావఁగార్ని ఖాతరు చెయ్యకుండానే ప్రవర్తించింది గాని, కారణం ఏమిటో తెలియదు. యిపుడు తెలుసుకున్న

కారణం చాలా అర్థరహితంగా తోచింది. ఆయన ప్రవర్తనని ఆమె గర్హించింది. "అసలు కారణం ఏవిటో తెలీకుండా, నేనుకూడా మీ అబ్బాయిలాగే తెలివితక్కువగా ప్రవర్తించాను అత్తయ్యగారూ! నన్ను క్షమించండి" అంది ప్రేమబాల.

జానకమ్మ బరువుగా ఓ నిట్టూర్పు విడిచింది.

"క్షమాపణ కోరడం కాదమ్మా నువ్విప్పుడు చెయ్యాల్సింది నీ చాకచక్యంతో భాస్కరంని మార్చాలి వాడిలోని మొండి పట్టుదల, నా మాటకూడా విననివ్వడంలేదు. మీ మావఁగారు కన్నకొడుకు ప్రవర్తనకి ఎంతగా లోలోన కుమిలిపోతున్నారో నీకు తెలీదమ్మా! విషయం అంతా చెప్పాను. ఆయన తప్పేమిటో నువ్వే ఆలోచించు" అంది, బాధగా

"అంతా అవగాహన చేసుకున్నాను అత్తయ్యగారూ! నా ప్రయత్నమేదో నేను చేస్తాను. మీరు నిశ్చింతగా వుండండి" అంటూ హామీ ఇచ్చింది, ప్రేమబాల.

జానకమ్మ మొహం, విప్పారింది. ఆ జవాబుకోసమే, ఆమె యిన్నాళ్ళు ఎదురు చూసింది మరేం అనకుండా, అక్కణ్ణించి వెళ్ళిపోయింది ప్రేమబాల ఆలోచనల్లో పడింది.

* * *

ఆరోజు ఆఫీసుకి బైలుదేరుతోన్న భాస్కరం, నిలువుటద్దంముందు నుంచుని నెక్ టై సర్దుకుంటూ భార్యను కేకేశాడు ఆమెనుండి జవాబేలేదు. నాలుగైదు రోజుల్నుంచి ఆమెలో ఏదో హఠాత్తుగా మార్పువచ్చినట్లనిపిస్తోందతనికి.



'దేవుడుచేసిన పెళ్లి' లో
లక్ష్మి, నాగభూషణం

"ప్రేమా...ఓ ప్రేమా..." విసుగ్గా మళ్ళీ కేకేశాడు.

"అబ్బబ్బ! ఏవిటండీ? ఎందుగా కేకలు?" అంటూ వచ్చింది.

భాస్కరం, నివ్వెరపోయాడు. భార్య ఎప్పుడూ అలా విసుక్కోవడం చూళ్లేదే! ఏవిటీ మార్పు?...అతనికేం బోధపడలేదు.

"ఏం చేస్తున్నావ్?" ఆమె మొహంలోకి చూస్తూ అన్నాడు.

"ఆడవాళ్ళకి పనులే వుండవా? ఏదో ఒకటి చేస్తుంటాం. అవన్నీ మీతో ఏకరువు పెట్టాలంటే సాధ్యమా చెప్పండి!

మావఁగారు యిప్పుడే బజార్నుంచి వచ్చారు. పాపం, యెండలో వచ్చారు, అందుకని నిమ్మకాయ నీళ్ళు చీనీ కలిపి యిస్తున్నా!"

అసలే ఆమెలో ఏదో మార్పు వచ్చిందని ఆలోచిస్తోన్న భాస్కరంకి, తన మాటల్ని లెక్కచెయ్యకుండా మావఁగార్ని ఆదరణతో చూస్తోన్న భార్య మీద చెప్పలేనంత కోపం వచ్చింది.

"ఏఁవిటి ప్రేమా, నాలుగయిదు రోజుల్నుంచి నీలో ఏదో మార్పు వచ్చినట్టు గమనించాను చివరికి నా మాటల్ని కూడా ఖాతరు చెయ్యనంత నిర్లక్ష్యంగా తయారవుతున్నావని, ఇప్పుడే తెలుసుకున్నాను. ఏవిఁటిదంతా? నీలో యిటువంటిమార్పు వస్తుందని నేనూహించలేదు" అన్నాడు విసురుగా

"ఎవరిలో, యెప్పుడు, యెటువంటి మార్పు వస్తుందో, యెవరు చెప్పగలరండీ? అయినా, పిలిస్తే పలకడం ఆలస్యమయినంతమాత్రాన అది నిర్లక్ష్యం అనుకోవడ మేవిఁటి?" యెదురు ప్రశ్న వేసింది, ప్రేమబాల.

ఆమె మాట్లాడే ధోరణి కొత్తగా కనిపించింది భాస్కరంకి

"పోనీ ఆ విషయం వదిలేద్దాం కాని, మా నాన్నగారిపట్ల ఇంత ఆదరణ చూపడ మేవిఁటి? నిర్లక్ష్యంగా వుండమని చెప్పానా?"

"మీరు చెబుతారండీ కాని, నలుగురి విమర్శకు గురయ్యేది నేను అయినా, కన్నతండ్రిమీద మీకింత కక్ష ఎందుకో నా కర్థం కావడంలేదు అష్టకష్టాలుపడి, మిమ్మల్ని చదివించి, ఈ స్థాయికి తీసుకొచ్చారు ఆయనేగా!" అని ప్రేమబాల యేదో చెబుతూ వుంటే, భాస్కరం ఆవేశాన్ని పట్టలేకపోయాడు.

"స్టాపిట్ . ఏవిఁటీ ధోరణి? నాకు నీతులు చెప్పడానికి ప్రయత్నిస్తున్నావా? పిచ్చిపిచ్చి వేషాలు వెయ్యకు. ఈ నిర్లక్ష్యాన్ని నేను సహించలేను నేను చెప్పినట్టు చెయ్యి నా అర్ధాంగివన్న మాట మర్చిపోకు " అన్నాడు కోపంగా.

ఆ క్లయిమాక్స్ కోసమే యెదురు చూస్తోంది ప్రేమబాల. నిర్లక్ష్యంగా ఓ నవ్వు నవ్వింది భాస్కరం మరీ రెచ్చిపోయాడు.

"ఏవిఁటా వెకిలినవ్వు . నీ హద్దుల్ని నువ్వు తెలుసుకోవడం మంచిది "

"ఎందుకండీ అంత కోపం? ఆత్మీయతలు, అభిమానాలు, వుండవల్సిన చోట, యే ఒక్కరిలో నిర్లక్ష్యమూ, నిరసనా పెరిగినా, యెదుటి వ్యక్తి యెంతగా బాధపడతారో స్వానుభవంతో తెలుసుకున్నారనుకుంటాను " సౌమ్యంగా అంది, ప్రేమబాల

భార్య మాటల్లో అంతరార్థం, చప్పున అవగాహన కాలేదు భాస్కరంకి మాటకి మాటా విసురుగా జవాబివ్వకుండా, అంత సౌమ్యంగా చెబుతోన్న ప్రేమబాలకేసి అదోలా చూశాడు ఏదో విశేషం వుందనిపించింది "అంటే యేవిఁటి నీ వుద్దేశం?"

"అంటే యేవిఁటో అర్థంకాలేదాండీ? ఇటీజ్ సింపిల్ మొన్న మొన్ననే మీ జీవితంలో అర్ధాంగిగా అడుగుపెట్టిన నేను, కాస్తంత నిర్లక్ష్యంగా ప్రవర్తించినంత మాత్రాన మీరు దాన్ని సహించలేక, ఆవేశాన్ని పట్టలేక, యేవిఁటేవిఁటో అన్నారు అర్ధాంగిగా నా హద్దుల్ని గుర్తుచేశారు మీరు చెప్పేనదాన్నే మీ నాన్నగారి విషయంలో మీరు యెందుకు విస్మ

రిస్తున్నారో, నాకు బోధపడదు. మిమ్మల్ని కని, పెంచి, ప్రయోజకుణ్ణి చేసిన ఆయన, మీరు ఆయనపట్ల ప్రకటిస్తున్న నిర్లక్ష్యాన్ని, నిరసనను చూసి, యెంతగా బాధపడుతూ వుంటారో, ఆలోచించారా? రిటైరయి మీమీదఆధారపడి వున్న వ్యక్తిగాబట్టి, మీమీద ఆవేశపడే అవకాశం లేదాయనకి కాని, ఆయన మనసులో రగుల్తున్న బాధ ఆయనలో యెటువంటి విరక్తిని కలిగిస్తుందో యోచించండి. ఆయన పరిస్థితి చూస్తూ, మీ తల్లిగారూ కుమిలిపోతున్నారు, యేమీ చెయ్యలేని నిస్సహాయ వ్యక్తిగా లోకులు మాత్రం వూరుకుంటారనా? మీ యెదుట అనకపోయినా, మీ పరోక్షంలో అనుకుంటారు అప్పుడు మీ అంతస్తుకి విలువే వుండదు. తల్లిదండ్రుల్ని నొప్పించి, మీరు సాధించేదేమిటో నాకు బోధపడదు అందుకే, మీకు యెలా చెప్పాలో తెలీక, నా కపట నిర్లక్ష్యాన్ని మీ ముందుంచాను నా ప్రయత్నం ఫలించింది. మీరు చదువుకున్నవారు. అర్థం చేసుకోగల శక్తివుంది. ఆపైన మీ ఇష్టం'' అంది.

భాస్కరం మాట్లాడలేకపోయాడు. అతని మెదడులో సంక్షోభం ప్రారంభమయ్యింది. తను ఇన్నాళ్ళూ తెలివితక్కువగా ప్రవర్తించాడేమోనన్న పశ్చాత్తాపం కలిగిందతనిలో. పశ్చాత్తాపమే మనిషి తప్పుల్ని ప్రక్షాళితం చేసేది! సిగ్గుతో అతని మొహం అవనితమయ్యింది అతనిలోని అహం కరిగిపోయింది భార్య రెండుచేతులూ పట్టుకున్నాడు.

“ప్రేమా! నా కళ్ళనుకప్పిన నీలితెరను తొలగించావు. నా ప్రవర్తనకి సిగ్గుపడుతున్నాను రియల్లీ అయామ్ ప్రౌడ్ ఆఫ్ యూ వస్తా... ఆలస్యమౌతోంది.” అంటూ నిష్క్రమించాడు.

ప్రేమబాల ఆనందానికి అవధుల్లేకపోయాయి. ఆమె మొహంలో వెయ్యి సూర్యుల వెలుగు ప్రకాశించింది.

* * *

ఆ రోజునించీ ఆ ఇంట్లోని వాతావరణమే మారింది, వీర్రాజు జీవితంలో వుత్సాహం మళ్ళీ పుంజుకుంది. ఇప్పుడా ఇల్లు ఆనందనిలయం. *

